పంగిడిపల్లి రోడ్డుతో పరేషాన్



పంగిడిపల్లి రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు



గుంతల రోడ్డుపై నిలిచిన వరదనీరు

- దెబ్బతిన్న రహదారితో ఇబ్బందులు
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు, బాటసారులు
- పట్టించుకోని అధికారులు

కమలాపూర్ : మండల కేంద్రం నుంచి పంగిడిపల్లికి వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఈ రెండు గ్రామాల నడుమ రాష్ట్రంలోనే రెండో హెచ్‌పీసీఎల్ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ ఉంది. ఈ గ్యాస్ ప్లాంట్‌కు నిత్యం వందలాది గ్యాస్ లారీలు, భారీ గ్యాస్ ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ భారీ వాహనాల సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక రోడ్డు నిర్మించాల్సి ఉన్నప్పటికీ గతంలో వేసిన పంగిడిపల్లి రోడ్డు మార్గం నుంచే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కమలాపూర్ నుంచి గ్యాస్ ప్లాంట్ వరకు ఉన్న రోడ్డంతా ధ్వంసమై పెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు బురదమయమై ప్రమాదకరంగా మారింది. దీని కారణంగా రెండు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసర వైద్యసేవలకు దూరం..

గ్యాస్ ప్లాంట్‌కు వచ్చిపోయే భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసమైన కారణంగా తాము అత్యవసర వైద్య సేవలకు దూరం కావాల్సి వస్తోందని పంగిడిపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఈ మార్గం గుండా 108, 102 అంబులెన్స్‌లు పంగిడిపల్లికి రావడం లేదని, రాత్రి సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నామని బాగు చేయాలని కోరుతున్నారు.

ఆందోళన చేస్తేనే మరమ్మతులు..

కమలాపూర్ నుంచి వెళ్లే ఈ రోడ్డుపై మోకాలులోతుగా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే నీరంతా ఆ గుంతల్లో చేరి రోడ్డంతా బురదమయమై అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్లాంట్ నిర్వాహకులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో పలుమార్లు ఆందోళనలకు దిగి గ్యాస్ లారీలు, ట్యాంకర్లను అడ్డుకున్నట్లు చెబుతున్నారు. చివరకు గ్యాస్ ప్లాంట్ నిర్వాహకులు డస్ట్, కంకర, మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని, కానీ కొద్ది రోజులకే మళ్లీ ఆ రోడ్డంతా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా గుంతలు పడి బురదమయమైందని, ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని వాహనదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



పంగిడిపల్లి నుంచి కమలాపూర్ వెళ్లే రోడ్డంతా పూర్తిగా దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడి బురదతో నిండిపోయింది. ఈ మార్గంలో అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదు. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు గుంతల్లో, బురదలో పడి గాయపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాగు చేయించాలి.

– శ్రీనివాస్, మాజీ సర్పంచ్, పంగిడిపల్లి

సీసీ రోడ్డు నిర్మించాలి



రోడ్డంతా గుంతలమయమై వర్షం కురిసినప్పుడు బురదగా మారుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్యాస్ లారీలు ఆపి ఆందోళన చేస్తే తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

– శంకర్‌రావు, పంగిడిపల్లి

గీత కార్మికుల రక్షణకే సేఫ్టీ కిట్లు



సేఫ్టీ కిట్లపై గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

వేలేరు : గీత కార్మికుల రక్షణకే ప్రభుత్వం సేఫ్టీ కిట్లను అందిస్తుందని సేఫ్టీ మోకుల ట్రెనింగ్ ప్రోగామ్ జిల్లా కో ఆర్డినేటర్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద సేఫ్టీ మోకుల వినియోగంపై గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల ప్రాణాలకు రక్షణగా కాటమయ్య రక్షణ కిట్లు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. గీత కార్మికులందరూ రక్షణ కిటను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వీరన్న, జనగామ జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ వెంకటమల్లయ్య, ట్రెనర్లు రాజయ్య, కార్తీక్, రాజేందర్, గీత కార్మికులు వెంకటేశ్, కుమార్, ప్రభాకర్, రవి, సుమన్, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- మున్సిపల్ కమిషనర్ సుష్మ



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుష్మ

పరకాల : వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల్లో కార్మికులు నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ సుష్మ సూచించారు. బుధవారం తెల్లవారుజామున 5గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆమె.. పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించొద్దని కార్మికులకు సూచించారు. అనంతరం పరకాల ప్రధాన రహదారులు, పలు కాలనీల్లో పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి అక్కడి నుంచి చెత్తను డంపింగ్ చేస్తున్న ప్రాంతం, గుంతలయంగా మారిన రోడ్డును పరిశీలించారు. భారీ వర్షాలు కారణంగా రెస్క్యూ టీంను అందుబాటులో ఉంచనున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

‘స్థానిక’ ఎన్నికల్లో జెండా ఎగరేయాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి



శాయంపేట : మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

- బీజేపీ నేత రామ్‌గోపాల్‌రెడ్డి

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో బీజేపీ మండల సంస్థాగత ఎన్నికల సమావేశం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో భీమదేవరపల్లి మండలంలో రూ.60లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు 20వేల సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గతంలో పాలించిన బీఆర్‌ఎస్, ప్రస్తుతం కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు పృథ్వీరాజ్, కొమురయ్య, సదానందం, కుమారస్వామి, కవిత, భద్రయ్య, అశోక్‌రెడ్డి, సూర్యప్రకాశ్, సుధాకర్, కనుకయ్య పాల్గొన్నారు.

శాయంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి కాషాయ జెండా ఎగరేయాలని శాయంపేట మండల ప్రభారి చదువు రామచంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీని నమ్ముకుని నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తలకు సముచిక స్థానం ఉంటుందన్నారు. అవకాశవాద రాజకీయాలతో పార్టీలు మారిన నాయకులకు బుద్ధి చెప్పాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి, నాయకులు దేవరాజ్, రవికిరణ్, రాజు, చంద్రమౌళి, నవీన్, నాగరాజు, విజయ్, తిరుపతి, శివ, సురేష్, సత్యనారాయణ, సంజీవరావు, రాజశేఖర్, సుమన్, మహేష్, భాస్కర్, రాకేష్ రెడ్డి, పైడి, సాంబయ్య, రమేశ్, తిరుపతిరెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ధర్నా

ఐనవోలు : యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. రైతు రుణమాఫీ, భూభారతిలో నెలకొన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కార్యదర్శి నాగరాజు, ఉప్పలయ్య, నర్సయ్య, రామ్‌కుమార్, రాజిరెడ్డి, ఐలయ్య పాల్గొన్నారు.

హెడ్‌కుక్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో హెడ్‌కుక్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని కన్వీనర్‌గా ఎంఈఓ, ఎంపీడీఓ, తహసీల్దార్ సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీ సమక్షంలో హెడ్‌కుక్ పోస్ట్‌కు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై కమలాపూర్ మండలానికి చెందిన 18 నుంచి 45 ఏళ్లు నిండిన మహిళలు, ఇంతకుముందు పెద్ద గ్రూపుల్లో వంటచేసిన అనభవం కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. వేతనం రూ.9,750 ఉంటుందని, ఆసక్తి గల మహిళలు పాస్‌పోర్టుఫొటో, బయోడేటా, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఏదైనా పెద్ద గ్రూపులో వంట వండిన అనుభవ పత్రం జతపర్చి ఈనెల 29వ తేదీలోపు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9848768383 నంబరును సంప్రదించాలని కోరారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం కేజీబీవీలో సీఈసీ మొదటి సంవత్సరంలో 15 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ మాధవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9866386308 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

పరకాల : కార్మికుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న ఏకైక కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అడగాని జనార్దన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీఎంఎస్ 71వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల కోసం ఎన్నో త్యాగాలు చేసి హక్కులను కాపాడుతూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. బీఎంఎస్ కార్మికుల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాట్లు వేసి బీజేపీ నాయకుల నిరసన



ఐనవోలు : కొండపర్తి నుంచి భట్టుపల్లికి వెళ్లే మార్గంలో కొద్దిపాటి వర్షానికే రహదారి బురదమయంగా మారింది. దీంతో బీజేపీ నాయకులు బుధవారం బురదరోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ మాట్లాడుతూ.. గ్రామం నుంచి నిత్యం వందలాది మంది ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొంతకాలంగా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రమేశ్, మహేష్, భరత్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్నేహితుడికి చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన పైండ్ల మహేష్ తండ్రి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా పైండ్ల మహేష్‌తో కలిసి 2005 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. దాసి శ్రావణ్‌కుమార్, మోరె సుమన్, రంగు రాజేశ్, సుమన్, తిరుపతి, అశోక్, వెంకటేశ్, భాను, నరేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ పీఆర్‌ఓగా శరత్‌కుమార్



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన పింగిళి శరత్‌కుమార్ విశాఖపట్టణంలోని టాటా మెమోరియల్ సెంటర్, హోమి బాబా కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్‌ఓ)గా నియామకమయ్యారు. విద్యా నైపుణ్యం, వృత్తి పరమైన అనుభవం కలిగిన శరత్‌కుమార్.. కమ్యూనికేషన్, జర్నలిజంలో ఎంసీజే, వృక్షశాస్త్రంలో ఎమ్మెస్సీ పట్టా పొందారు. ఇంతకుముందు భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్‌లో సీనియర్ నిపుణుడిగా, కన్సల్టెంట్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన నియామకంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

కూలిన పురాతన బావి



శాయంపేట : మండల కేంద్రంలోని పాత తపాలా కార్యాలయ ఆవరణలో గల పురాతన మంచినీటి బావి బుధవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. అయితే ఈ బావిని స్వాతంత్య్రం రాకముందు నిర్మించారని, స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తెలిపారు.

పాఠశాలను గాడిన పెట్టాలి

ఐనవోలు : ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ పనితీరు బాగా లేదని, పాఠశాలను గాడిన పెట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ బుధవారం పాఠశాల హెచ్‌ఎం సదానందానికి వినతిపత్రం అందించారు. మూత బడిన పాఠశాలను గ్రామస్తులు ఐక్యతతో తిరిగి ప్రారంభించుకుని ఎనిమిదేళ్లుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అయితే పాఠశాల నూతన కమిటీ ఎన్నిక సక్రమంగా జరగలేదని, ఆ కమిటీని రద్దు చేయాలన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలి



ఎల్కతుర్తి : విద్యార్థులు చదువుపై దృష్టిసారించి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామి ఆకాంక్షించారు. బుధవారం భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధతో వినాలన్నారు. విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులశ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు రాజు, అర్జున్, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి డీటీగా రమేశ్

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని ఎల్కతుర్తి మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా బొల్లు రమేశ్‌ను నియమిస్తూ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకాలం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో రమేశ్ పనిచేశారు. కాగా ప్రస్తుతం ఎల్కతుర్తి డీటీగా పనిచేస్తున్న భద్రునాయక్‌ను పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని రమేశ్ స్థానంలోకి బదిలీ చేశారు

అసంక్రమిత వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

వర్ధన్నపేట : కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అసంక్రమిత వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నేహా ఫాతిమా సూచించారు. మండలంలోని ఎస్‌ఎస్ తండాలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పలువురు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశరత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశరత్

పరకాల : ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పరకాల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశరత్ సూచించారు. వరంగల్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో కోర్టు ప్రాంగణంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వంద మందికి ఉచిత వైద్యం, బీపీ, షుగర్, ఈసీజీ, టూడీఈకో పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య పరీక్షలు చేసుకోవడం వల్ల ఏదైన అనారోగ్య సమస్యలు ఉంటే ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మెడికవర్ గుండె వైద్య నిపుణుడు షఫీ, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు నవీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండెల భద్రయ్య, ఏజీపీ మేరుగు శ్రీనివాస్, ఏపీపీ రుధిర, కుమార్, న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు ఒంటేరు రాజమౌళి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, తదితరలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పరకాల : పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన

- బంద్ విజయవంతమని నాయకుల ప్రకటన

ఎల్కతుర్తి /పరకాల / దామెర / ధర్మసాగర్ / ఐనవోలు : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందించారు. అలాగే పరకాలలో బంద్ బుధవారం విజయవంతమైందని డీవైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను మూసివేయించినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చించారు. అలాగే దామెర మండలంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి బుధవారం మండల కేంద్రంలోని పాఠశాలలను మూసివేయించి బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే ధర్మసాగర్ మండల కేంద్రంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తహసీల్దార్ సదానందానికి వినతిపత్రం అందించారు. అదే విధంగా ఐనవోలులో బుధవారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు యూఎస్‌పీసీ బాధ్యుడు బానోత్ రాము వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేసి నెలాఖరులోగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు

- సీఐ, తహసీల్దార్, ఏఓ



తనిఖీ చేస్తున్న అధికారులు

ధర్మసాగర్ : వ్యవసాయానికి వినియోగించాల్సిన యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సదానందం, ఏఓ రాజేశ్ తెలిపారు. యూరియాను ఇండస్ట్రీలో వినియోగించడం చట్టరీత్యా నేరమని అన్నారు. బుధవారం మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో యాడ్‌బ్లూ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (ఏడీబీఎల్ యూతః డీఈఎఫ్) విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియాని ఇండస్ట్రీలో వాడటం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 125 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ చేసినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై నరసింహారావు, పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే అషురాఖానా పనుల అడ్డగింత



వక్ఫ్ పట్టా రికార్డును చూపిస్తున్న మదీన కమిటీ సభ్యులు

శాయంపేట : కొంత మంది తమ స్వలాభం కోసమే అషురాఖానా నిర్మాణాన్ని అడ్డుకున్నారని మైలారం మదీన కమిటీ అధ్యక్షుడు ఎండీ.అక్బర్‌పాషా ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 13వ తేదిన మైలారం గ్రామంలోని వక్ఫ్ భూమిపై జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన క్రమంలో అధికారులు విచారణ చేస్తున్న సమయంలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆ స్థలం వక్ఫ్ భూమి సీరియల్ నంబర్ 13064కి చెందిందని తెలిపారు. దీంతో అషురాఖానా కోసం 1970 సంవత్సరంలో అప్పటి ముతవళి షేక్ బడే పేరున పట్టా అయినట్లు తెలిపారు. వక్ఫ్ పరిధిలో ఉండడంతో అషురాఖానా నిర్మించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కొంత మంది వ్యక్తులు స్వలాభం కోసం నిర్మాణాన్ని అడ్డుకున్నారని, గతంలో మైలారం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో షేక్ బడే ముతవళిని అప్పటి స్థానికులు సంప్రదించి పీరీలకు ఒక గది, గ్రామ పంచాయతీకి ఒక గది కేటాయించాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొందరు రాజకీయ స్వార్థం కోసం ఇప్పుడు ఆ స్థలం పూర్తిగా గ్రామపంచాయతీదని అనడం సబబు కాదన్నారు. నిజానిజాలు తెలుకుని మాట్లాడాలని హితవు పలికారు. మదీన కమిటీ నాయకులు ఎండీ.యాకూబ్‌పాషా, రఫీ, సలీమ్‌పాషా, ఇస్మాయిల్, దావుద్, ఫిరోజ్ పాల్గొన్నారు.

మంచిచెడును తెలిపేందుకే ప్రహరీ క్లబ్



మాట్లాడుతున్న డాక్టర్ మేఘన

వేలేరు : విద్యార్థినులకు మంచిచెడును తెలిపేందుకే ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేఘన స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలైతే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని వాటి జోలికి వెళ్లొదన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి ప్రహరీక్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మంచిచెడులపై అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థినులు ఇష్టపడి చదవాలని, చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని, దాన్ని ఛేదించేందుకు కష్టపడాలని ఈ సందర్భంగా సూచించారు. మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.